క్లుప్తంగా

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): ఏపీ మోడల్ స్కూల్లో ఇటీవల నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ పరీక్షలో వినుకొండ మండలంలోని పెదకంచర్ల మెయిన్ పాఠశాలకు చెందిన సనిశెట్టి త్రిలోక్య వైష్ణవి 80 మార్కులతో ప్రథమ ర్యాంక్‌లో సీటు సాధించారని ప్రధానోపాధ్యాయిని పి.శివకుమారి తెలిపారు. అదేవిధంగా సీహెచ్. చరణ్ అనే విద్యార్థి కూడా అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

వేల్పూరులో స్టూడెంట్స్ కిట్లు పంపిణీ



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పారా హైమావతి పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని, బొల్లా పేరయ్య, దోడ్డా ఏడుకొండలు,పారా చౌదరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాత సురేష్ బాబుకు సన్మానం



వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజీలో జరిగిన రక్తదాన శిబిరంలో 83 సార్లు రక్తం ఇచ్చిన రాష్ట్ర అవార్డు గ్రహీత, బెస్ట్ సోషల్ యాక్టివ్ వర్కర్ పి.వి.సురేష్ బాబును నిర్వాహక కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆపద సమయాల్లో రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని సూచించారు. అనంతరం పి.వి.సురేష్‌బాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

20న వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరులో కొలువైయున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పూజారి చిలకపాటి భరద్వాజ ఆధ్వర్యంలో ఆలయ శుద్ధి, అలంకరణ, అభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం చేయనున్నారు. రాత్రి ఆలయం వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పాఠశాలలకు కిట్‌లు పంపిణీ



మాచర్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి పాఠశాలకు ప్రత్యేక వాహనాల్లో కిట్‌లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మరో ఆరు రోజుల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఎంఈవో అల్లి సురేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షమి, ఉపాధ్యాయులతో పాటు, మండల విద్యా శాఖ రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తోడుగా నిలవాలని విన్నవించారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ రోజు నుంచి నియోజకవర్గంలో పేరుకున్న సమస్యలపై సమరం చేయబోతున్నానని తెలిపారు. గత ఐదేళ్లు ఒక లెక్క ఇక నుంచి మరో లెక్క అన్నారు. ఇక నుంచి తన దృష్టికి వచ్చిన వాటిని పరిష్కరించేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానన్నారు. కపలవాయి విజయ కుమార్, పులుకూరి జగ్గయ్య, ఇమిడిశెట్టి కాశయ్య, గాడిపర్తి సురేష్, చిన్నప రెడ్డి, భుజంగరావు, గూడూరు శేఖర్, బాలు, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, నాయకులు

అన్ని గ్రామాల్లో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లాలోని వినుకొండ ప్రాజెక్టు పరిధిలో 34 కేంద్రాల్లో గల అంగన్‌వాడీ పిలుస్తోంది అనే పేరుతో చిన్నారులను చేర్చుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ పీడీ కె.ఉమారాణి తెలిపారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులు, అంగన్‌వాడీలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రాల ద్వారా లబ్ధిపొందే గర్భిణులకు, బాలింతలు, మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరుకునేందుకు తల్లులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. పూర్వప్రాథమిక విద్యకు అవసరమైన పుస్తకాలు ఆట వస్తువులు సరఫరా చేస్తున్నట్లు పీడీ వివరించారు. గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమం నిర్వహించారు. 5 ప్లస్ నిండిన పిల్లలందరికీ అంగన్‌వాడీ సెంటర్లలో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అనురాధ, సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఉమారాణి

మన గ్రోమోర్ సెంటరులో ఎరువులు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనుకు అనుగుణంగా ఎరువులు కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మన గ్రోమార్ సెంటరు బ్రాంచ్ మేనేజరు చిలకబత్తిని సురేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రోమార్ సెంటరులో బ్రాంచ్ మేనేజరు మాట్లాడుతూ వ్యవసాయ పరంగా రైతులు ఇబ్బందులు పడకుండా అన్నీ ప్రముఖ కంపెనీలకు చెందిన ఎరువులు, పురుగుమందులు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ఎరువులు, పురుగు మందుల అన్నీ సమృద్ధిగా ఉన్నాయన్నారు. ఎరువులు ఎంఆర్‌పీ ధర, పురుగుమందులు అమ్మకాలు ఆన్‌లైన్ విధానంలో ప్రతిరోజు జరుగుతుందన్నారు. ఒక్కో సంచి యూరియా ధర రూ.266.50 పైసలు మాత్రమే అన్నారు. ఇందుకుగాను 5 వేల సంచుల నిల్వలు ఉన్నాయన్నారు. ఎరువులు పురుగు మందులు కొరత లేకుండా రైతులు దళారుల నుంచి మోసపోకుండా ఉండటానికి అమ్మకాలు పారదర్శకంగా చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన రైతులు సమగ్ర వివరాలతో కూడిన బిల్లు బయోమెట్రిక్ విధానంలో జరుగుతుందన్నారు.



ఎరువుల సంచులను పరిశీలిస్తున్న బ్రాంచ్ మేనేజరు సురేంద్రకుమార్

రక్తదానం ప్రాణదానంతో సమానం

నరసరావుపేట రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నరసరావుపేట ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జేఎస్ సురేష్ కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.ఎం.ఎస్.వి. శ్రీనివాస గుప్తా, బత్తుల మురళీ, డాక్టర్ రేహమతుల్లా, బీవీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సురేష్ మాట్లాడుతూ రక్తదానం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. మానవతా దృక్పథంతో రక్తదానం చేయాలన్నారు. ఒకరు రక్తదానం చేయడం ద్వారా రెడ్‌క్రాస్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కళాశాలకు చెందిన 38 మంది విద్యార్థులు రక్తదానం చే శారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

రొంపిచర్ల: మలేరియా వ్యాధి దోమల వల్ల వ్యాప్తి చెందుతుందని రొంపిచర్ల ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాల్వల్లో, గుంటల్లో, పాత టైర్లలో, కుండల్లో నీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. అలాగే దోమ తెరలను ఉపయోగించుకోవాలన్నారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



రామిరెడ్డిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మోడల్‌స్కూలు, కేజీబీవీలో సీట్ల భర్తీ

నాదెండ్ల: చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరేందుకు 300 మందికి పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని, మెరిట్ ఆధారంగా 160 మందిని చేర్చుకోనున్నట్లు తెలిపారు. శుక్రవారం నాటికి 135 మంది విద్యార్థులను చేర్చుకున్నట్లు ఆమె తెలిపారు. మిగిలిన సీట్లను సోమవారం నాటికి భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకుని అనివార్య కారణాలతో కళాశాలలో చేరని అభ్యర్థుల స్థానంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో ఎంపీసీ గ్రూపుకే అడ్మిషన్లు

నాదెండ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 80 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. కేవలం ఎంపీసీ గ్రూపులో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా 40 మందికి కాల్ లెటర్లు పంపినట్లు ఆమె తెలిపారు. త్వరలో విద్యార్థులను జాయిన్ చేసుకోనున్నట్లు తెలిపారు. సీట్లలో చేరని వారి స్థానంలో వెయిట్‌లిస్ట్ ఆధారంగా భర్తీ చేపడతామని తెలిపారు.

32 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు అరెస్టు

మాచర్ల రూరల్: అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 11 బ్యాగుల్లో 32 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని నాగార్జున సాగర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ సీఐ కె.సురేష్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రా మీదుగా కర్ణాటక రాష్ట్రానికి గంజాయి తరలించేందుకు ముగ్గురు వ్యక్తులు కారులో నాగార్జునసాగర్ మీదుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీలు నిర్వహించగా వారి వద్ద 16 బ్యాగుల్లో 32 కేజీల గంజాయి గుర్తించామన్నారు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరంకు చెందిన మడకం రాంబాబు, బురగా రాజేశ్వరి, చోళంకి చంద్రశేఖర్‌లుగా గుర్తించామన్నారు. ఈ గంజాయిని చిత్తూరు జిల్లా మదనపల్లికి తరలించేందుకు వెళ్తుండగా పట్టుబడ్డట్లు చెప్పారు. దీని విలువ సుమారు రూ.3.20 లక్షలకు పైగా ఉంటుందని, ఈ ఘటనలో పట్టుబడ్డ వాహనాన్ని, గంజాయిని స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సోమ్లానాయక్, సాంబ నాయక్, విజయ్, సీతయ్య తదితరులున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సురేష్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. పట్టణంలోని పురుషోత్తమ పట్నం, సొలస వారి వీధి, శిల్పశాల, పోలిరెడ్డి పాలెం, కోంద్రుపాడు ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే వేలూరు, కుక్కపల్లి వారిపాలెం, తుర్లపాడు, సందెపూడి గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: పట్టణంలో కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. ఇస్లాంపే ట, బాబాపేట, వెంగళరెడ్డినగర్, చిత్రాలయ సెంటర్, సీపీటీ, వినుకొండ రోడ్డు, ఎస్‌ఆర్‌కేటీ కాలనీ ల్లో సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు

యడ్లపాడు: పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సరిత చెప్పారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగా, పిల్లిపెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని 50శాతం రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. కావల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం నకళ్లను అందజేయాల్సి ఉంటుందని శుక్రవారం వెల్లడించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రొంపిచర్ల: మండలంలోని రైతులకు సరఫరా చేసేందుకు 408 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శివలలిత శుక్రవారం తెలిపారు. 50 శాతం రాయితీపై విత్తనాలను రైతులకు అందజేస్తామన్నారు. 235 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 107 క్వింటాళ్ల జనుములు, 66 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జనుములు, జీలుగలు ఎకరాకు 10 కేజీల చొప్పున, పిల్లిపెసర విత్తనాలు 8 కేజీల చొప్పున అందజేస్తామన్నారు. రాయితీ పోను రైతు వాటాగా జనుము, జీలుగులకు కేజీకి రూ.44 లు చొప్పున, పిల్లిపెసరకు కేజీకి రూ.67లు చొప్పున రైతు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఒక్కొక్క రైతుకు గరిష్టంగా 5 ఎకరాల వరకు విత్తనాలు అందజేస్తామన్నారు. అవసరమైన రైతులు పొలం పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆర్‌బీకే కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీ పరిధిలోని రెంటచింతలలోని పలు కాలనీలలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలోనున్న పాతటైర్లు, కొబ్బరి బొండాలను వెంటనే తొలగించాలని, ఎయిర్ కూలర్‌లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వారి నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్ కాల్వల్లో వారానికి ఒకసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను, కిటికీలకు మెస్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దోమలను పారదోలడం వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ ప్రతి ఫ్రైడే ను డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ మహేష్‌బాబు, డి.సీతారామిరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి

మాచర్ల: నియోజకవర్గంలో పాఠశాలల బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ తీసుకోని బస్సులు రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డి అన్నారు. శుక్రవారం సాగర్ రోడ్డులోని ఆర్టీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఎక్కువ ప్రైవేటు పాఠశాలల వారు బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సు, ఇన్సూరెన్సు, పొల్యూషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు తప్పకుండా కలిగి ఉండాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్టర్ కోడెల స్టేడియాన్ని బాగు చేస్తాం

ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంను అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించి అనంతరం మీడియాతో మాట్లాడారు. స్టేడియం ఐదేళ్లుగా పాడుబడిందనీ, దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల మానస పుత్రిక అయిన స్టేడియాన్ని దగ్గరుండి బాగు చేయించుకోవటం తమ కర్తవ్యమన్నారు. వాకింగ్ ట్రాక్, జిమ్, స్విమ్మింగ్ పూల్ పాడుబడ్డాయన్నారు. వీటిని బాగు చేయించుకోవాల్సిన బాధ్యత తమకు ఉందని, బాగు చేస్తామన్నారు. అన్నీ సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్నింటి బాగుకోసం బడ్జెట్ విడుదల చేయిస్తామని చెప్పారు. స్టేడియం బాగుకు మున్సిపల్ కమిషనరు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి, నాయకులు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

స్తంభాలపై విద్యుత్ తీగలు చోరీ!

యడ్లపాడు: కరెంటు సరఫరా ఉండి స్తంభాపై ఉన్న విద్యుత్ తీగలు చోరీ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామం నుంచి మైదవోలు వెళ్లే మార్గంలో ఎడమవైపున కనిపించే సాయి వెంచర్‌లో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... సాయి వెంచర్ డెవలప్‌మెంట్‌లో భాగంగా 2020లో విద్యుత్ స్తంభాల్ని ఏర్పాటు చేసి 6 కిమీ పొడవైన విద్యుత్ తీగలతో 11 కేవీ, ఎల్‌టీ లైన్ నుంచి సరఫరా ఇచ్చారు. సదరు వెంచర్ ఊరికి వెలుపల ఉండటం, అక్కడి ప్లాట్లలో నివాసాలు ఏర్పరచుకోకపోవడంతో నిర్మానుష్యంగా ఉంటుంది. వాచ్‌మెన్ ఉన్నా పగలు మాత్రమే ఉండటం ఇవన్నీ బాగా పరిశీలించిన దుండగులు వెంచర్‌లోని విద్యుత్ స్తంభాలకు వెళ్లే మెయిన్ లైన్‌ను కర్రతో కొట్టి సరఫరాను బ్రేక్ చేసి అన్ని స్తంభాలపై ఉన్న అల్యూమినియం తీగల్ని ఊడ దీసుకుని ఉడాయించారు. ఈనెల 11వ తేదీ రాత్రి జరిగిన ఈ ఘటన గురించి వాచ్‌మెన్, పశువులు కాపర్లు గుర్తించి వెంచర్ యజమానికి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే వెంచర్ యజమాని రాజవరపు కృష్ణ కుమారి విద్యుత్‌శాఖ అధికారులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని ఆశ్రయించారు. దీంతో యడ్లపాడు విద్యుత్ ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో చోరీపై ఫిర్యాదు చేశారు. చోరీ అయిన తీగల విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని దీనిని సీరియస్‌గా తమ డిపార్టుమెంట్ తీసుకుందని సాంబశివరావు వెల్లడించారు.



వెంచర్‌లో తీగలు చోరీ కావడంతో ఖాళీగా ఉన్న విద్యుత్ స్తంభాలు

మలేరియా మాసోత్సవాలు విజయవంతం చేయండి

శావల్యాపురం: మలేరియా మాసోత్సవాలను వైద్య ఆరోగ్య సిబ్బంది విజయవంతం చేయాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతతో పాటు మురుగుకాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజాజీవితానికి దూరంగా ఉంచాలన్నారు. ఈనెల 30 వరకు మలేరియా మాసోత్సవాలు అన్నీ గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించటంతో పాటు ప్రజల్లో చైతన్యం పెంపొందించేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. దోమల నిల్వలు నియంత్రణకు మురుగుకాల్వల్లో ఎబెట్ మందును పిచికారి చేయించాలన్నారు. అందరు దోమ తెరలను వినియోగించాలన్నారు. దోమ కాటు వలన మలేరియా జ్వరం, చికెన్‌గున్యా, తదితర వ్యాధుల బారిన పడతారన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మలేరియా మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మిప్రసన్న, ధనలక్ష్మి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.




మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది

నేడు ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

ప్రిన్సిపాల్ కె.పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులలో ఖాళీల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య తెలిపారు. శుక్రవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో నున్న ఖాళీలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. 6 తరగతిలో 35 ఖాళీలు, 7వ తరగతిలో 40 ఖాళీలు, 8వ తరగతిలో 25 ఖాళీలు, 9వ తరగతిలో 35 ఖాళీలు, ఇంటర్ ఫస్ట్‌యర్‌లో 30 ఖాళీలు, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 35 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ 9182958496 ను సంప్రదించాలని కోరారు.



పట్టణంలో సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్

మాచర్ల: పట్టణంలోని 31 వార్డుల్లో మంచినీటి, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఇబ్బంది పడ్డామన్నారు. ఎన్నికలు పూర్తయి, రెగ్యులర్ విధుల్లో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు కలిసి సమష్టిగా పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. శనివారం నుంచి ప్రతి వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటామన్నారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా విద్యుత్, పారిశుద్ధ్యం, నీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వార్డుల్లో సమస్యలు ఉంటే తమ దగ్గరలోని సచివా లయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

అక్కడ పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆయా సచివాలయాల్లో ఉన్న సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.



పోస్టాఫీసు ఎదుట బాధితుల ఆందోళన

మాచర్ల రూరల్: తమ చిన్నారుల భవిష్యత్తు కోసం పోస్టాఫీసులో చిన్న మొత్తాల పొదుపులో జమ చేస్తున్న నగదును సొంతానికి వాడుకుని ఖాతాదారులను మోసం చేసిన ఉద్యోగిపై చర్య తీసుకుని నగదును తిరిగి ఇప్పించాలంటూ ఖాతాదారులు పోస్టాఫీసు ఎదుట నిరసన చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని కంభంపాడు గ్రామంలో పోస్టాఫీసులో వివిధ చిన్న మొత్తాల పొదుపు ఖాతాలలో, స్కీంలలో గత మూడు సంవత్సరాల నుంచి ఖాతాదారులు నెల నెలా జమ చేస్తున్నారు. ఇటీవల ఖాతాలలో నగదును ఆన్‌లైన్‌లో పరిశీలించగా జమ కానట్లు చూపించటంతో వారు అనుమానం వచ్చి పోస్టుమాస్టర్ కార్తీక్‌ను నిలదీయగా పుస్తకంలో స్టాంప్ వేసి సంతకం పెడుతున్నామని, డబ్బులు ఎక్కడకు వెళ్లవని, ఆన్‌లైన్ ప్రాబ్లం వలన కొంత సమయం పడుతుందని మాయమాటలతో కాలం గడిపారు. ఈ విషయంపై సత్తెనపల్లి హెడ్ పోస్టాఫీసుకు ఫిర్యాదు చేయగా ఎంక్వైరీ చేసి సదరు పోస్టుమాస్టర్ కార్తీక్‌ను గత ఏడాది విధుల నుంచి తొలగించారు. అయినప్పటికీ ఖాతాలలో నగదును జమ చేయకపోవటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. నగదును ఇప్పించి ఖాతాలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, వి.పెద నరసింహారావు, రంగారెడ్డి, సీహెచ్ హరి, నవ్య శ్రీ, లక్ష్మమ్మ, శ్రీలక్ష్మి, ఈశ్వరమ్మ, మంగమ్మ, నాగేంద్రం తదితరులున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com